సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం। 18। జనవరి। 2024



ఆర్టీసీకి ఆదాయం
సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీకి వారం రోజుల్లో రూ.8.12 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఎం తెలిపారు. 10లో



సమ్మెతో స్తంభించిన రవాణా
లారీ డ్రైవర్లు చేపట్టిన సమ్మెతో రవాణా వ్యవస్థ స్తంభించగా పంట ఉత్పత్తుల తరలింపు నిలిచిపోయింది. 12లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30°/18°
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి, ఉదయం వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం



స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించిన దృశ్యం

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో బుధవారం స్వామివారికి స్నపన తిరుమంజనం జరిపారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన రామయ్యకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. దేవస్థానానికి అనుబంధంగా ఉన్న పర్ణశాల ఆలయ హుండీ కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజులపాటు తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.నారాయణమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 99896 33364 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి నర్సింగ్ పరీక్షలు

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని వైద్య కళాశాలలో నర్సింగ్ విద్యార్థులకు నేటి నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య కళాశాల హెచ్‌ఓడీ, చీఫ్ సూపరింటెండెంట్ మోకాళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం జరిగే పరీక్ష 10 గంటల నుంచి 1 గంట వరకు ఉంటుందని, విద్యార్థులు 9 గంటల లోపు కళాశాల ఆవరణలో ఉండాలని కోరారు. బీపీటీ, ఎంఎస్‌ఈ నర్సింగ్, పోస్టు బీఎస్‌ఈ నర్సింగ్ విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌ఎల్ లక్ష్మణ్‌రావు పరీక్షలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న తెలంగాణ సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను కోరుతున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన, ఇంగ్లిష్ మీడియం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రూ.100 చెల్లించి ఈ నెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందని, పరీక్షలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వివరించారు.

మైనారిటీ గురుకులంలో..
అశ్వారావుపేట: మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.సంగీత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో 40 సీట్లు, 6వ తరగతిలో 5 సీట్లు, 7వ తరగతిలో 7 సీట్లు, 8వ తరగతిలో 1 సీటు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ఇంటర్ ఎంపీసీ విభాగంలో 40 సీట్లు, బైపీసీ విభాగంలో 40 సీట్లకు అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులను గురుకులంలో నేరుగా అందించాలని తెలిపారు.

కుష్ఠు రహిత సమాజానికి కృషి

ఇల్లెందు: రాష్ట్రంలో కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు కూడా సహకరించాలని తెలంగాణ స్టేట్ వైద్య ఆరోగ్యశాఖ కుష్ఠు విభాగం డిప్యూటీ పీఎంఓ డాక్టర్ సకలారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఇల్లెందు ఏరియాలో పర్యటించారు. రొంపేడు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఇల్లెందు ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఓ డాక్టర్ శిరీష, ఏపీఎంఓ అరుణ, భద్రూ, డాక్టర్ కవిత, డీపీఎంఓ గన్యా నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగని సీతమ్మ..!



నిలిచిపోయిన సీతమ్మ సాగర్ పనులు

బహుళార్థ సాధక ప్రాజెక్టు అయిన సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణ పనుల తీరు ఒక అడుగు ముందుకు నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టుగా మారింది. సరైన అనుమతులు తీసుకోకుండా నిర్మాణ పనులు మొదలెట్టారంటూ ఇటు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, అటు కేంద్ర పర్యావరణ శాఖ కన్నెర్ర చేశాయి. దీంతో గడిచిన ఏడు నెలలుగా ఈ బ్యారేజీ నిర్మాణ పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయనే విషయమై స్పష్టత కానరావడం లేదు. ఏడేళ్ల కిందట మొదలైన సీతారామ ప్రాజెక్టులో కీలకమైన బ్యారేజీ నిర్మాణం గోదావరి సుడిగుండంలో చిక్కుకున్నట్టుగా మారింది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఏడు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే
- సీతమ్మ సాగర్‌పై గ్రీన్ ట్రిబ్యునల్ అభ్యంతరాలు
- ద్వి సభ్య కమిటీ నివేదికపై ఎన్జీటీ అసంతృప్తి
- తాజాగా అనుమతుల్లేవంటూ కేంద్రం కొర్రీ
- ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తే మేలు

ఏడు నెలలుగా
గోదావరి నీటిని ఒడిసి పట్టుకుని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలోని పొలాల్లో పారించేందుకు చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా సీతమ్మసాగర్ బ్యారేజీని నిర్మిస్తున్నారు. దుమ్ముగూడెం, అశ్వాపురంల మధ్య గోదావరి నదిపై 1.5 కిలోమీటర్ల పొడవుతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. జల విద్యుత్ కేంద్ర నిర్మాణం కోసం 200 మీటర్లు వదిలిపెట్టి, మిగిలిన 1.3 కి.మీ పొడవుతో మొత్తం ఆరు బ్లాకులుగా విభజించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో ఒకటి నుంచి నాలుగు బ్లాకుల్లో పియర్లు, స్పిల్‌వే నిర్మాణం పూర్తయింది. క్రస్ట్ గేట్లు బిగించడమే తరువాయి అనుకునే తరుణంలో అవాంతరాలు వచ్చిపడ్డాయి.

కేంద్ర పర్యావరణ శాఖ ఆగ్రహం
గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో 2023 మే చివరి వారంలో నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. పని ప్రదేశం నుంచి భారీ యంత్రాలను, నిర్మాణ సామగ్రిని బయటకు తరలించారు. పనుల కోసం వచ్చిన మ్యాన్ పవర్‌ను వెనక్కి పంపారు. దీంతో ఒకప్పుడు సందడిగా కనిపించిన బ్యారేజీ నిర్మాణ ప్రదేశం నేడు వెలవెలబోతోంది. ఆ తర్వాత ఎన్నికల హడావుడి మొదలవడంతో సీతమ్మ సాగర్ పనుల్లో కదలిక రాలేదు. మరోవైపు గ్రీన్ ట్రిబ్యునల్ నియమించిన ద్విసభ్య కమిటీ నివేదిక సైతం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చింది. దీంతో అనుమతులు లేకుండా పనులు చేపట్టడంపై కేంద్ర పర్యావరణ శాఖ ఆగ్రహం వ్యక్తం చేస్తూ జరిమానా విధించేందుకు సిద్ధమైంది. దీంతో సమస్య మరింత జటిలంగా మారింది.

30 శాతం పూర్తయ్యాక అవాంతరాలు..
బ్యారేజీల నిర్మాణానికి నవంబర్ నుంచి జూన్ వరకు అనువైన కాలం. నదిలో నీటి ప్రవాహం, వరదలు తక్కువగా ఉండటం వల్ల పనులు వేగంగా చేపట్టడం సాధ్యమవుతుంది. గతేడాది ఇదే తీరుగా పనులు చకచకా నిర్వహించారు. దాదాపు బ్యారేజీ నిర్మాణ పనులు 30 శాతం పూర్తయ్యాక అవాంతరాలు ఎదురయ్యాయి. అన్ని సర్దుకుని ఈ సీజన్‌లో అయినా పనులు మొదలవుతాయని భావిస్తే, నిరాశే ఎదురైంది. ఇప్పటికైనా గ్రీన్ ట్రిబ్యునల్, కేంద్ర పర్యావరణ శాఖ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి రూ.ఐదు వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా ఒక్క ఎకరాకు నీళ్లు రావడం లేదు.

అనుమతులు వచ్చేవరకు పనులు చేపట్టొద్దు
సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణం కారణంగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని గ్రామాలు, పొలాలు, అడవులు మునిగిపోతాయనే ఆందోళన చెలరేగింది. నష్టపరిహారం సైతం తగిన మొత్తం చెల్లించడం లేదంటూ రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు బాధితుల్లో కొందరు పూర్తి స్థాయిలో అనుమతులు తీసుకోకుండా బ్యారేజీ నిర్మాణ పనులు చేపడుతున్నారంటూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)ని ఆశ్రయించగా.. అన్ని అనుమతులు వచ్చేవరకు బ్యారేజీ నిర్మాణ పనులు కొనసాగించొద్దని ఎన్‌జీటీ ఆదేశాలు జారీ చేసింది. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని అంచనా వేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్‌లో రీజినల్ డైరెక్టర్ (హైదరాబాద్) , గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డులో ఎస్‌ఈ ర్యాంక్‌కు తక్కువ కాని ఇద్దరు అధికారులు సభ్యులుగా కమిటీని నియమించింది.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన పీఓ ప్రతీక్ జైన్, ఇతర అధికారులు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా సంక్షేమం కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ, అటవీ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, వ్యవసాయ, మిషన్ భగీరథ, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. రోడ్లు, విద్యుత్ సౌకర్యం, గిరివికాసం బోర్లు తదితర పనులకు జిల్లాస్థాయి కమిటీ ఆమోదించినట్లు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న పనులకు అంతరాయం కల్పించవద్దని అటవీ శాఖాధికారులకు సూచించారు. పనులు చేపట్టే ముందు ఆయా శాఖల అధికారులు, అటవీ శాఖాధికారులను సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పీసీసీఎఫ్ వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతుల వివరాలు అందజేయాలన్నారు. జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో గిరివికాసం బోరు బావులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన మండలాల్లో భూకేటాయింపులు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. అటవీ అనుమతులు లేకపోవడంతో బోరుబావులు వేయని గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మూరుమూల గ్రామాల్లో సెల్‌ఫోన్ సేవలు అందేలా టవర్ల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన అటవీ భూముల అనుమతుల కోసం ఐటీడీఏకు ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. అటవీ భూముల్లో పనులు చేపట్టేందుకు తప్పనిసరిగా జిల్లాస్థాయి కమిటీలో ఆమోదించాల్సి ఉంటుందని చెప్పారు. పోడు పట్టాలున్న గిరిజన రైతులు పామాయిల్ సాగు చేసుకునేలా బోరుబావులు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అటవీ, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్లు డాక్టర్ రాంబాబు, మధుసూదన్‌రాజు, జిల్లా అటవీ అధికారి కిష్టాగౌడ్, ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, జిల్లా వ్యవసాయాధికారి కొర్స అభిమన్యుడు, డీపీఓ రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకే గనిలో డీఎంఎస్, డీడీఎంఎస్ పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 ఇంక్‌లైన్ గనిని బుధవారం డీఎంఎస్(డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ) ఉమేష్ ఎం. సావర్కర్, డీడీఎంఎస్ పి.సనత్‌కుమార్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఏరియా జీఎం ఎం. శాలేంరాజు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అధికారులు గనిలో బొగ్గు రవాణా, మ్యాన్ పవర్ ఆన్ రోల్, కేజీ, మ్యాన్ రైడింగ్ పనులను పరిశీలించారు. కంటిన్యూస్ మైనర్ (సీఎమ్మార్) ద్వారా జరుగుతున్న బొగ్గు ఉత్పత్తిపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. తొలుత గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, ఏజెంట్ రవీందర్ గనిలోని సీములు, ఉత్పత్తి ప్రక్రియను తదితర వివరాలను పవర్ పాయింట్, మ్యాప్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు గురవయ్య, జె.కుమారస్వామి, ఉపేందర్, షాకీర్, మొయినొద్దీన్, షాకీర్, ఎం.ప్రదీప్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

టేకులపల్లిలో నెగ్గిన అవిశ్వాసం

- ఎంపీపీకి వ్యతిరేకంగా 11 మంది ఎంపీటీసీల ఓటు
- మొత్తం 14 మందిలో ఎంపీపీ సహా మరో ఇద్దరు సభ్యుల గైర్హాజరు



ఎంపీపీకి వ్యతిరేకంగా ఓటు వేస్తున్న ఎంపీటీసీలు

టేకులపల్లి: బీఆర్‌ఎస్‌కు చెందిన టేకులపల్లి ఎంపీపీ భూక్య రాధపై అవిశ్వాసం నెగ్గింది. బుధవారం కొత్తగూడెం ఆర్డీఓ ఆర్.శిరీష అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశం నిర్వహించగా, 11 మంది ఎంపీటీసీలు ఎంపీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఎంపీపీ రాధతోపాటు మరో ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. మొత్తం 14 మంది ఎంపీటీసీలు ఉండగా, ప్రస్తుతం 11 మంది కాంగ్రెస్‌లో, ఎంపీపీతోపాటు మరో ఇద్దరు బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. ఎంపీపీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, సభ్యులను పట్టించుకోవడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని, అధికారిక సమావేశాలు, కార్యక్రమాలకు సమాచారం ఇవ్వడం లేదనే కారణాలతో గత డిసెంబర్ నుంచి 11 మంది ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాసం సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ గత నెల 15, 20 తేదీల్లో కలెక్టర్, ఆర్డీఓ, డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓలకు లేఖలు అందజేశారు. పరిశీలించిన అధికారులు అవిశ్వానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీటీసీలు ఊకె రామకృష్ణ, భూక్య శంకర్, ఉండేటి ప్రసాద్, బాణోతు పూర్ణ, బాణోతు సరోజిని, బాణోతు మౌనిక, చింత శాంతకుమారి, భట్టు శైలజ, పూనెం స్వప్న , జాల సంధ్య, వాంకుడోత్ ధనలక్ష్మితోపాటు కో ఆప్షన్ సభ్యుడు మౌలానా సమావేశానికి హాజరయ్యారు. అవిశ్వాసాన్ని ఎదుర్కొంటున్న ఎంపీపీ భూక్య రాధ, మరో ఇద్దరు భూక్య బాలకృష్ణ, జాలాది అప్పారావు ముగ్గురు సభ్యులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కాగా ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం కాపీని కలెక్టర్ అందజేస్తామని ఆర్డీఓ శిరీష తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కోట వీరబాబు, తహసీల్దార్ కొండపల్లి కృష్ణవేణి, ఎంపీఓ గాంధీ, సూపరింటెండెంట్ సామల శ్రీనివాస్, జయకృష్ణ పాల్గొన్నారు.

నూతన ఎంపీపీ బరిలో ఐదుగురు..?
ప్రస్తుత ఎంపీపీపై అవిశ్వాసం నెగ్గడంతో కలెక్టర్ ఆమోదం తర్వాత సుమారు రెండు మూడు రోజుల్లో కొత్త ఎంపీపీ ఎన్నిక నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో 11 మందిలో ఐదుగురు సభ్యులు పీఠం కోసం పోటీ పడుతున్నట్లు సమాచారం.

బాధితులకు న్యాయం చేయాలి

కొత్తగూడెంటౌన్: క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఎస్పీ బి.రోహిత్‌రాజు సూచించారు. బుధవారం ఆయన కొత్తగూడెం వన్ టౌన్ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఠాణాలో రికార్డులను పరిశీలించడంతోపాటు అధికారులతో మాట్లాడి పలు కేసుల వివరాలు తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని ప్రదేశాల్లో నిరంతరం పెట్రోలింగ్ చేపట్టాలని, బ్లూ కోల్ట్స్ సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఎస్పీ సూచించారు.



సీఐ, ఎస్సైలకు సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. బుధవారం సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 710 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.22,635, 350 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.17,770 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

ఆశలన్నీ కొత్త సీఎంపైనే..

- భద్రగిరి అభివృద్ధికి నిధులిస్తారని ఎదురుచూపులు
- ఆనవాయితీగా నవమికి సీఎం రేవంత్ వస్తారని ఆశ
- ఏప్రిల్ 17న సీతారాముల కల్యాణం
- ఇప్పటికే శ్రీరామనవమి పనులకు టెండర్ల ఆహ్వానం



భద్రాచల రామాలయం (ఇన్‌సెట్) దేవస్థానం వద్ద మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి(ఫైల్)

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల ప్రక్రియ ప్రారంభమైంది. దేవస్థానంలో వచ్చే ఏప్రిల్ 17న సీతారాముల కల్యాణం, 18న పట్టాభిషేకం జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 9 నుంచి 23 వరకు భద్రాచలంలో వసంత ప్రయుక్త నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మరో మూడు నెలలు మాత్రమే సమయం ఉండగా, ఉత్సవాలకు సంబంధించిన ఇంజనీరింగ్ పనులకు ఆలయ అధికారులు శ్రీకారం చుట్టారు. వేడుకల ఏర్పాట్లకు రూ. 1.5 కోట్ల నిధులు కేటాయించగా, ఆలయ ఈఓ రమాదేవి టెండర్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే శ్రీరామనవమికి సీఎం హోదాలో ఈ ఏడాది రేవంత్ రెడ్డి అధికారికంగా హాజరు కావాల్సి ఉంది.

రూ.1.5 కోట్లతో నవమి ఏర్పాట్లు
భద్రాచలం, పర్ణశాల దేవస్థానంలలో నవమి ఏర్పాట్లకు ఆలయ అధికారులు సుమారు రూ.1.5 కోట్ల నిధులు కేటాయించారు. భద్రాచలం, పర్ణశాల దేవస్థానంలలో సుమారు రూ.10 లక్షలతో కల్యాణ మండపం, ఇతర మండపాలకు రంగులు, ఉడ్ ఆర్చ్‌ల అమరిక, తొలగింపు పనులకు రూ.4 లక్షల 27 వేలు, సెక్టార్ గేట్లు, ఆర్చ్‌లకు రూ. 6 లక్షల 80 వేలు, ఖమ్మం, కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలంలలో స్వాగత ద్వారాలకు రూ. 4 లక్షలను కేటాయించారు. భద్రాచలం, పర్ణశాల దేవస్థానం ప్రాంగణాల్లో చలువ పందిళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షల 84 వేలు, కల్యాణ మండపం, క్యూలైన్ల పెయింటింగ్‌కు రూ.6 లక్షల 18 వేలు, విస్తా కాంప్లెక్స్, స్టేడియం పరిసర ప్రాంతాల్లో వసతి నిర్మాణం కోసం రూ.8 లక్షల 37 వేలు, కల్యాణ కట్ట, గోదావరి తీరంలో తాత్కాలిక వసతి, బట్టలు మార్చుకునే గదుల నిర్మాణానికి రూ.10 లక్షలు, మరో ఆరు, పది లక్షలు పలు ప్రాంతాల్లో తాత్కాలిక వసతి గదులకు, కార్పెట్లకు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లకు రూ. 9 లక్షల 78 వేలు, కల్యాణ మండపంలో ఏసీలకు రూ. 10 లక్షలు, పూల అలంకరణకు రూ. 8 లక్షలు, పోస్టర్లు, ప్రచారానికి రూ.4.5 లక్షలతోపాటు మరికొన్ని పనులకూ నిధులు కేటాయించారు. కాగా ఈఓ టెండర్లను ఆహ్వానించగా, టెండర్ ఖరారు ప్రక్రియ ప్రారంభం కాగానే పనులు ప్రారంభిస్తామని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు.

సీఎం రేవంత్‌పైనే కోటి ఆశలు
కల్యాణ మహోత్సవం సందర్భంగా సీతారాములకు ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందించడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత నిజాం ప్రభువులు సమర్పించేవారు. తెలంగాణ ఏర్పడ్డాక 2015, 2016 వేడుకలకు సీఎం హోదాలో కేసీఆర్ హాజరయ్యారు. భద్రాచలం, దేవస్థానం అభివృద్ధికి రూ. 100 కోట్ల నిధులు ఇస్తామని ప్రకటించారు. ఆ తర్వాత ఏడేళ్లు సీఎంగా కేసీఆరే కొనసాగినా ఒక్కసారి కూడా వేడుకలకు రాలేదు. ఒకసారి ఆయన మనుమడు హిమాన్షు, అనంతరం మంత్రులు మాత్రమే హాజరయ్యారు. ప్రకటించిన రూ.100 కోట్లలో పైసా విడుదల చేయలేదు. దీంతో భద్రాచలంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు చెలరేగాయి. ఇటీవల జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వచ్చే కల్యాణానికి ఆయనే ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికలకు ముందు గత ఏడాది ఫిబ్రవరి 14న జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్ నిజాం కాలం నుంచి వస్తున్న సంప్రదాయాన్ని, వంద కోట్ల హామీని కేసీఆర్ విస్మరించారని ఆరోపించారు. తమ పార్టీ భద్రాచలం అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొత్త సీఎం శ్రీరామనవమికి హాజరై భద్రాచలం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక విడుదల చేస్తారని ఈ ప్రాంత ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు.

19,20 తేదీల్లో మెడికల్ బోర్డు సమావేశాలు

సింగరేణి సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): అనారోగ్య కారణాలతో విధులు నిర్వర్తించలేని ఉద్యోగుల కోసం ఈ నెల 19, 20 తేదీల్లో మెడికల్ బోర్డ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని, డబ్బు తీసుకుని అన్‌ఫిట్ చేయిస్తామని దళారులు ప్రలోభపెడితే నమ్మొద్దని హెచ్చరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులందరినీ మెడికల్ బోర్డ్‌లో నిపుణులైన వైద్యులు పరీక్షించి అన్‌ఫిట్ చేస్తారని పేర్కొన్నారు. అన్‌ఫిట్ అయితే వారి వారసులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపడుతున్నామని అన్నారు. దళారులు ఎవరైనా సంప్రదిస్తే విజిలెన్స్ విభాగం దృష్టికి తీసుకెళ్లాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. మోసగాళ్లపై నిఘా పెట్టాలిందిగా పోలీసు శాఖను కూడా అప్రమత్తం చేశామన్నారు.



సింగరేణి సీఎండీ బలరామ్

క్లుప్తంగా

జీసీసీ గోదాముల పరిశీలన

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ) కార్యాలయాన్ని బుధవారం ఐటీడీఏ పీఓ నియమించిన ప్రత్యేకాధికారి ఉదయ్‌భాస్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసే గోదాములతోపాటు రికార్డులను పరిశీలించారు. స్టాక్, ఆడిట్ వివరాలపై ఆరా తీశారని బ్రాంచ్ మేనేజర్ లక్ష్మాజి తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రి సీజ్



ఎస్‌బీఐరోడ్‌లో సీజ్ చేసిన ఆస్పత్రి

పాల్వంచ: అనుమతి లేని వైద్యుడితో నడిపిస్తున్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిని వైద్యశాఖ ఉన్నతాధికారులు ఇటీవల సీజ్ చేశారు. పట్టణంలోని ఎస్‌బీఐరోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఒకరి పేరుపై ఉండగా మరో వైద్యుడు చికిత్స చేస్తున్నట్లు స్థానికుల నుంచి ఫిర్యాదు అందింది. దీంతో డీఎంహెచ్‌ఓ శిరీష సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వైద్య శాఖకు తెలిపిన వైద్యులు కాకుండా మరో వైద్యుడు ఉండటంతో ఆస్పత్రిని సీజ్ చేశారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

జూలూరుపాడు: మండలంలోని జూలూరుపాడు – వినోభానగర్ గ్రామాల మధ్య ప్రధాన రహదారి గుంతలమయంగా ఉండటంతో బుధవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వినోభానగర్ గ్రామానికి చెందిన భూక్యా అనిల్ జూలూరుపాడు వైన్‌షాపులో పని చేసి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. రహదారిపై గుంతలు ఉండటంతో బైక్ అదుపుతప్పి పడిపోగా అనిల్‌కు గాయాలు కావడంతో స్థానికులు జూలూరుపాడులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనిల్‌ను కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జూదరులపై కేసు

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందింది. ఎస్‌ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,300 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

కేసు నమోదు

దుమ్ముగూడెం: మండలంలోని వర్క్‌షాపునకు చెందిన తాటిపూడి రమేశ్‌కు చెందిన ధాన్యం దొంగతనంపై ఎస్‌ఐ కేశవరావు బుధవారం కేసు నమోదు చేశారు. తాటిపూడి రమేశ్ తన పొలంలో వరి ధాన్యాన్ని ఆరబెట్టాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొంతమంది వ్యక్తులు సుమారు 10 బస్తాల ధాన్యాన్ని చోరీ చేశారు. రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పండుగకు వచ్చిన అల్లుడు మృతి

ఖమ్మంఅర్బన్: సంక్రాంతి పండుగకు అత్తారింటికి వచ్చిన అల్లుడు (డాక్టర్) గుగులోత్ ఉమేశ్ (37) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఆయన తండ్రి లచ్చిరాం ఫిర్యాదుపై బుధవారం ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ శ్రీహరి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో డాక్టర్‌గా (ఆస్పత్రి నడుపుతున్న) పనిచేస్తున్న డాక్టర్ ఉమేశ్ సంక్రాంతి పండుగకు తన భార్య అశ్విని, కుమారుడు, కుమార్తెతో కలిసి ఈ నెల 15న పాండురంగాపురంలో ఉంటున్న అత్తారింటికి వచ్చారు. మంగళవారం బంధువులంతా ఓ ఫంక్షన్‌లో పాల్గొన్నారు. రాత్రి పడుకున్న అనంతరం అస్వస్థతకు గురైన ఉమేశ్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తుండగా మృతిచెందినట్లు తమకు సమాచారం అందించారని, తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి లచ్చిరాం ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం త్రీటౌన్ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన గంజి సుబ్బలక్ష్మి (50) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. ఇంటిపై భాగంలో శబ్దం రావటంతో కింద ఉన్న ఆమె కుమార్తె కల్యాణి వెళ్లి చూడగా ఆమె ఉరివేసుకుని కనిపించింది. కల్యాణి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి చూడగా అప్పటికే సుబ్బలక్ష్మి మృతి చెందింది. ఆమె కుమారుడు నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

సీఓఈలో ప్రవేశాలకు చాన్స్

- 20 వరకు దరఖాస్తు గడువు
- ఉమ్మడి జిల్లాలో మూడు కళాశాలల్లో అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్ : పేద విద్యార్థులు ఇంటర్ చదువుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంఘిక సంక్షేమ గురుకులాలకు మంచి ఆదరణ లభిస్తోంది. గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్రంలోని కొన్ని కళాశాలలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)లుగా మార్చి ఇంటర్ విద్యాబోధన చేస్తుండడంతో వాటిలో ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. సీఓఈ కళాశాలల్లో విద్యనభ్యసించిన వారు పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధిస్తూ ప్రతిభ చాటుతున్నారు. సీఓఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల వారికి ఇంటర్మీడియట్ బోధనతో పాటుగా ఐఐటీ, నీట్, సీఎంఏ, సీఎల్‌ఏటీ లాంటి ప్రవేశ పరీక్షలకు ఉచితంగా ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆంగ్లంలో మాత్రమే బోధన ఉండే ఈ కళాశాలల్లో సెకండ్ లాంగ్వేజ్ మాత్రం తెలుగు ఉంటుంది. బాల, బాలికలకు సాంఘిక గురుకుల విద్యాలయాల సంస్థ వేర్వేరుగా కళాశాలలను ఏర్పాటు చేసింది.

అర్హతలు ఇవే..

సీఓఈ కళాశాలల్లో చేరాలంటే విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి పరీక్షలకు(2024 మార్చి) సన్నద్ధం అవుతూ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి 17 సంవత్సరాలు నిండి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, కన్వర్టెడ్ క్రిస్టియన్లకు రెండేళ్ల మినహాయింపు ఉంటుంది. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించకుండా ఉండాలి.



పాల్వంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఉమ్మడి జిల్లాలో మూడు కళాశాలలు..

రాష్ట్ర వ్యాప్తంగా 38 సీఓఈలను ఏర్పాటు చేయగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు కళాశాలలు ఎంపికయ్యాయి. ఖమ్మంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళాశాల(బాలికలు), దానవాయిగూడెం జూనియర్ కళాశాల(బాలికలు), భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ జూనియర్ కళాశాల (బాలురు) సీఓఈలుగా గుర్తింపు పొందాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక ఖమ్మంలోని అంబేద్కర్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో 60, బైపీసీ గ్రూపులో 60 సీట్లు ఉండగా, పాల్వంచ, దానవాయిగూడెం కళాశాలల్లో ఎంపీసీలో 40, బైపీసీలో 40 చొప్పున సీట్లు ఉన్నాయి. వీటిలో సీట్లు పొందేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుపేద విద్యార్థులు పోటీ పడుతున్నారు.

ప్రవేశ పరీక్ష తప్పనిసరి..

సీఓఈ కళాశాలలో సీట్లు పొందేందుకు విద్యార్థులు తప్పనిసరిగా ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. రెండు స్థాయిలో ఈ పరీక్ష నిర్వహించి మెరిట్ మార్కులు సాధించిన వారికి ఆయా కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. మొదటి లెవెల్, రెండో లెవెల్ పేరుతో గురుకుల విద్యాలయాల సంస్థ కామన్ టెస్ట్ నిర్వహిస్తుంది. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో టెస్ట్ సమయం మూడు గంటల పాటు ఉండనుండగా.. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకు నిర్దేశించిన పాఠ్యాంశాల ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు.

ఈనెల 20 వరకు గడువు..

కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గురుకుల విద్యాలయాల సంస్థ గడువు విధించింది. విద్యార్థులు రూ.200 ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా tswreis.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. హాల్‌టికెట్లు ఫిబ్రవరి 3వ తేదీ లోపు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొదటి లెవెల్ స్క్రీనింగ్ పరీక్ష ఫిబ్రవరి 4న, రెండో లెవెల్ పరీక్ష ఫిబ్రవరి 25న ఉంటాయి. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో మాత్రమే ప్రవేశాలు ఉంటాయి.

ఆస్పత్రులు అప్‌గ్రేడ్ అయ్యేనా..?

- హడావుడిగా ప్రకటించిన గత ప్రభుత్వం
- మూడు ఆస్పత్రులు వంద పడకల స్థాయికి..
- కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని విన్నపం



ఇల్లెందులోని 30 పడకల ఆస్పత్రి

కొత్తగూడెంరూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లాలోని 30 పడకల ఆస్పత్రులను 100 పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్‌గ్రేడేషన్‌పై దృష్టి సారించాల్సిఉంది. ఏజెన్సీ జిల్లా కావడంతో ఏటా విషజ్వరాలు విజృంభిస్తుంటాయి. ఈ నేపథ్యంలో అప్‌గ్రేడ్ చేస్తే మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంటుంది. అశ్వారావుపేట, ఇల్లెందు, చర్ల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు గత ప్రభుత్వం హడావుడిగా ప్రకటించింది. చర్ల ఆస్పత్రికి రూ.10 కోట్లు, అశ్వారావుపేట, ఇల్లెందు ఆస్పత్రులకు రూ.37.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి టెండర్ ప్రక్రియ ప్రారంభించి, పనులు చేపట్టాల్సిఉంది. అశ్వారావుపేట ఆస్పత్రికి దమ్మపేట, ఏపీలోని కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి తదితర ప్రాంతాల నుంచి, ఇల్లెందు ఆస్పత్రికి గుండాల, ఆళ్లపల్లి, బయ్యారం, టేకులపల్లి, కారేపల్లి తదితర ప్రాంతాల నుంచి, చర్ల ఆస్పత్రికి వాజేడు, వెంకటాపురం మండలాలతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని సరిహద్దు గ్రామాల ప్రజలు వైద్యం కోసం వస్తారు. 20 నుంచి 30 కిలోమీటర్ల మేర ఉన్న గ్రామాల నుంచి ప్రజలు వచ్చి చికిత్స పొందుతారు. ఇక చర్ల ఆస్పత్రిలో గతంలోనే 50 పడకలతో సీమాంక్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. కానీ అమలు చేయలేదు. దీంతో గర్భిణులు ప్రసవం కోసం, మాతా, శిశువులు మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు. చర్ల నుంచి భద్రాచలానికి దూరం ఎక్కువగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. కొత్త ప్రభుత్వం సత్వరమే స్పందించి మెరుగైన వైద్యం అందేలా అప్‌గ్రేడ్ చేసిన ఆస్పత్రులకు నిధులు విడుదల చేసి, వంద పడకలను అందుబాటులోకి తేవాలని, సీమాంక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.

ఆర్టీసీకి ఆదాయం అదుర్స్



ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఇలా..

ఖమ్మం రీజియన్‌లో సంక్రాంతికి రూ. 8.12 కోట్లు

ఖమ్మంమామిళ్లగూడెం : సంక్రాంతి పండుగ ఆర్టీసీకి కలిసొచ్చింది. ఈనెల 11 నుంచి 16 వరకు ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోలకు చెందిన బస్సులు తిరగడంతో రూ.8,12,23,000 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఎం సీహెచ్ వెంకన్న తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, జంగారెడ్డిగూడెం, గుంటూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు బస్సులు నడిపించారు. ఈ ఏడాది 'మహాలక్ష్మి' తాకిడి ఉండడంతో సర్వీసులు అధికంగా నడిపించారు. దీంతో ఖమ్మం డిపోలో రూ.1,94, 31,000, భద్రాచలంలో రూ.1,59,25,000, సత్తుపల్లిలో రూ.1,43,78,000, మణుగూరులో రూ.1,14,51,000, కొత్తగూడెంలో రూ. 90.11 లక్షలు, మధిరలో రూ. 85.57 లక్షలు, ఇల్లెందు డిపోలో రూ. 24.70 లక్షల ఆదాయం వచ్చింది. ఈ బస్సుల్లో మొత్తం ప్రయాణికుల సంఖ్య 10.28 లక్షలు కాగా, అందులో మహాలక్ష్మి టికెట్ల ద్వారా 5.33 లక్షల మంది మహిళలు ఉన్నారు. రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 2,610 సర్వీసులు కాగా అదనంగా 214 బస్సులు నడిపారు.

డిపో	రెగ్యులర్ బస్సులు	అదనపు సర్వీసులు	మొత్తం
ఖమ్మం	690	53	743
మధిర	310	15	325
సత్తుపల్లి	465	70	535
భద్రాచలం	430	30	460
కొత్తగూడెం	290	23	313
మణుగూరు	335	18	353
ఇల్లెందు	90	05	95

బకాయి పేరుతో పింఛన్లు నిలిపివేత

ఎన్‌జీబీ మేనేజర్‌ను నిలదీసిన లబ్ధిదారులు



బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న వృద్ధులు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ప్రతి నెలా అందిస్తున్న పింఛన్ల నగదును ఓ బ్యాంకు మేనేజర్ వ్యవసాయ రుణాల బకాయిల కారణంగా నిలిపివేయగా వివాదమైంది. బుధవారం దీనిపై లబ్ధిదారులు సదరు బ్యాంకు మేనేజర్‌ను నిలదీయగా, కొద్ది సేపు వాగ్వాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అశ్వారావుపేటలోని ఎన్‌జీబీలో దాదాపు 25 మంది వృద్ధులకు సంబంధించిన ఆసరా పింఛన్ల నగదు ప్రతి నెలా ప్రభుత్వం జమ చేస్తోంది. కాగా, వారికి అదే బ్యాంకులో వ్యవసాయ రుణాల బకాయిలు ఉన్నాయి. ఈ రుణాలు చెల్లించడం లేదనే కారణంగా మేనేజర్ పింఛన్ల నగదును వ్యవసాయ రుణాల్లో జమ చేస్తామని నిలిపివేశారు. దీంతో లబ్ధిదారులు మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఎస్‌కే బాజీని ఆశ్రయించగా వారు బ్యాంకు మేనేజర్ మణికంఠారెడ్డిని నిలదీశారు. వ్యవసాయ రుణ బకాయిల కోసం ప్రభుత్వం వృద్ధులకు అందించే పింఛన్లు నిలిపివేసేందుకు నిబంధనలు ఉన్నాయా.? ప్రశ్నించారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు బ్యాంకు వద్దకు చేరుకొని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే మేనేజర్‌తో ఫోన్లో మాట్లాడి వృద్ధులను ఇబ్బంది పెట్టొద్దని, పింఛన్ల నగదు వారికి అందించాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. బ్యాంకు మేనేజర్ మణికంఠారెడ్డి మాట్లాడుతూ.. అశ్వారావుపేట బ్రాంచ్ పరిధిలో రూ.16 కోట్ల వరకు మొండిబకాయిలు ఉన్నాయని, ఖాతాదారులు అంగీకరిస్తేనే వ్యవసాయ రుణ బకాయిల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే పింఛన్ల నగదును నిలిపివేశామన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్ 'రాయల' కారు సీజ్

బకాయి పేరుకుపోవడంతో డీసీసీబీ చర్యలు



డీసీసీబీ అధికారులు సీజ్ చేసిన శేషగిరిరావు కారు

ఖమ్మంవ్యవసాయం : అప్పు బకాయి సకాలంలో చెల్లించకపోవడంతో జిల్లా కో- ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు కారును డీసీసీబీ అధికారులు ఖమ్మంలో బుధవారం జప్తు(సీజ్) చేశారు. శేషగిరిరావు డీసీసీబీ ఖమ్మం ప్రధాన కార్యాలయం నుంచి 2018లో రూ.27లక్షల కారు రుణం తీసుకున్నారు. వ్యక్తిగత రుణం కింద తీసుకున్న ఈ రుణాన్ని వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కాగా, 2020లో జరిగిన సహకార సంఘాల ఎన్నికల సమయంలో తీసుకున్న రుణం నుంచి నిర్దేశించిన మొత్తం (సుమారు రూ.10 లక్షలు) చెల్లించారు. ఆ తర్వాత బకాయిలు పేరుకుపోయాయి. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకోవడంతో పేరుకుపోయిన బకాయిలపై దృష్టి సారించాలని డీసీసీబీ నిర్ణయించింది. నోటీసులు ఇచ్చినా బకాయిలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. అధిక బకాయి కలిగిన వారిలో శేషగిరిరావు కూడా ఉన్నట్లు వారు గుర్తించారు. ఇప్పటివరకు దాదాపు రూ.26.50 లక్షల వరకు రుణ బకాయి ఉందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఆ బకాయి సకాలంలో చెల్లించకపోవడంతో నగరంలోని కవిరాజునగర్‌లో ఉన్న శేషగిరిరావు కారును సీజ్ చేసినట్లు వివరించారు.

రెండు బైక్‌లు ఢీ

ఒకరు మృతి.. రెండేళ్ల బాలుడికి గాయాలు



గుగులోత్ పవన్‌కల్యాణ్ మృతదేహం



ప్రభుత్వ ఆస్పత్రిలో బాలుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

జూలూరుపాడు: మండల కేంద్రం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా రెండేళ్ల బాలుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వినోభానగర్ గ్రామానికి చెందిన గుగులోత్ పవన్‌కల్యాణ్ (25), అతడి భార్య సునీత, రెండేళ్ల కుమారుడు కుశాల్ సంక్రాంతి పండుగ కోసమని కొమ్ముగూడెం వెళ్లారు. పవన్‌కల్యాణ్ తన బైక్‌పై కుమారుడు కుశాల్‌ను తీసుకొని కొమ్ముగూడెం అత్తగారింటి నుంచి స్వగ్రామం వినోభానగర్ వెళ్తున్నాడు. భార్య సునీత తల్లిగారింటి వద్ద ఉండిపోయింది. ఈ క్రమంలో జూలూరుపాడు నాయక్ రైస్ మిల్లు సమీపంలోకి రాగానే టీవీఎస్ ఎక్సెల్ వాహనం, పల్సర్ బైక్‌లు అదుపుతప్పి ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పవన్‌కల్యాణ్ రోడ్డుపై పడిపోవడంతో అదే సమయానికి హైదరాబాద్ నుంచి మణుగూరు వెళ్తున్న కారు అతడిని ఢీకొట్టి కొద్ది దూరం ఈడ్చికెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడు కుశాల్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. టీవీఎస్ ఎక్సెల్ వాహనదారుడు రోడ్డు పక్కన పడిపోవడంతో అతడికి స్వల్ప గాయాలు కాగా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఏఎస్‌ఐ తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది కలిసి ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలను నమోదు చేసుకున్నారు. కారు డ్రైవర్ వాహనంతోపాటు పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి



లకావత్ సునీత (ఫైల్)

టేకులపల్లి: పురుగులమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతిచెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని రాంపురం పంచాయతీ పాతతండాకు చెందిన బానోత్ మాంగిణి కుమార్తె సునీత (38)కు లాకావత్ శివతో సుమారు పదేళ్ల కిందట వివాహమైంది. వారికి పాప, బాబు ఉన్నారు. ఏడేళ్ల కిందట సునీత భర్త శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో ఇద్దరు పిల్లలతో పాతతండాలోని పుట్టింట్లోనే ఉంటోంది. రెండేళ్ల నుంచి టేకులపల్లి మండలం కొత్తతండా (పి) గ్రామానికి చెందిన ధరావత్ రమేశ్‌తో సునీత వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. దీంతో రమేశ్ ఇంట్లోనూ గొడవలు జరుగుతున్నాయి. రమేశ్ భార్య రెండు రోజుల కిందటే పెద్దమనుషులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని కోరింది. మంగళవారం రమేశ్ పాతతండాలోని సునీత ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. తీవ్ర మనస్తాపానికి గురైన సునీత పురుగులమందు తాగింది. విషయం తెలుసుకున్న రమేశ్ వెంటనే వచ్చి ఆటోలో కొత్తగూడెం తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ సునీత బుధవారం మృతి చెందింది. మృతురాలి తల్లి మాంగని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన పత్తి

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామవాసి కారం చిన్నబ్బికి చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. చిన్నబ్బి కుటుంబ సభ్యులతో వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా ఇంట్లో సాయంత్రం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వస్తువులు, పత్తి, ధాన్యం, నగదు, బంగారం, పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు కాలిపోయి కట్టుబట్టలతో మిగిలారు. ఘటనా స్థలాన్ని ఆర్‌ఐ లక్ష్మయ్య సందర్శించి పంచనామా నిర్వహించి రూ.5 లక్షల మేర నష్టం వాటిలినట్లు అంచనా వేశారు.

పూరిల్లు దగ్ధం



దగ్ధమైన పూరిల్లు

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామంలో బండి కొండల్‌రావుకు చెందిన పూరిల్లు బుధవారం రాత్రి అగ్నికి ఆహుతైంది. బాధితుడి కథనం ప్రకారం.. కొండల్‌రావు ఒక్కడే నివాసం ఉంటున్న ఆ ఇంట్లో వంట చేసుకునేందుకు కట్టెల పొయ్యి వద్ద మంట చేసి సరుకులు తెచ్చుకునేందుకు దగ్గరలోని దుకాణం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో మంటలు పూరిల్లుకు అంటుకుని దుస్తులు, వంట సామగ్రి, బియ్యం, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. దీంతో రూ.50 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు యువకుల హల్‌చల్

నేలకొండపల్లి: మద్యం మత్తులో ఇద్దరు యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వీరంగం సృష్టించారు. ఈ యువకులు వారి తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించగా పోలీసులపై కూడా దురుసుగా ప్రవర్తించారు. మొత్తం వీడియో తీస్తూ హల్‌చల్ చేశారు. మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు కొంతకాలంగా మద్యం సేవిస్తూ తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారు. వారి కుటుంబ సభ్యులు నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. స్థానిక పోలీసులు సదరు యువకులను బుధవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకులు పోలీస్‌స్టేషన్‌లో వీరంగం సృష్టించారు. పోలీసులు ఎంతగా వారించినా వినకుండా పోలీస్ స్టేషన్ మొత్తాన్ని వీడియో తీస్తూ.. అసభ్య పదజాలంతో దూషించారు. ఒక దశలో పోలీసులు వారిని అదుపు చేసేందుకు ప్రయత్నించగా.. గోడ దూకి పారిపోయి మళ్లీ తిరిగి వచ్చారు. పోలీసులపై రాళ్లు విసిరేందుకు కూడా ప్రయత్నించారు. అరుపులు, కేకలతో రచ్చరచ్చ చేశారు. చివరికి తల్లిదండ్రులు కూడా వారిని ఇంటికి తీసుకెళ్లేందుకు నిరాకరించడంతో యువకులను బంధించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు



గాయపడిన సత్యనారాయణశాస్త్రి

కామేపల్లి: సంక్రాంతి పండుగకు అత్తారింటికి వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో కారును మరో కారు ఢీకొనడంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. బుధవారం ముచ్చర్ల క్రాస్ రోడ్డు సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణశాస్త్రి, పద్మ దంపతులు కారులో తిమ్మారావుపేట (పద్మ పుట్టింటికి) సంక్రాంతి పండుగకు వెళ్లారు. బుధవారం ఉదయం కారులో ముచ్చర్ల క్రాస్ రోడ్డు వైపు వెళ్తుండగా మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీల కారు ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణశాస్త్రి తలకు గాయం కాగా పద్మకు కుడి చెయ్యి విరిగింది. క్షతగాత్రులను స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

- ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌పేపర్‌ప్లేట్స్ & LEDమిషన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1427]

Wanted

- ఖమ్మం లోకల్ ప్రముఖ సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు & సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 11-13 వేలు, 12 గంటల డ్యూటీ. 7036191924, 8121046046. [M-1167600]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-8443]
- హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [H-793680]
- Required 2 Office Assistants Male, Qly: Degree with Computer, MS-Office at Khammam Local. Cell: 9441538583. [M-1167504]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9705444182, 9010299957

కొత్తగూడెం : 9010223783

పాల్వంచ : 9705444183

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

చరిత్రాత్మకంగా చైతన్యమూర్తి

ఆకాశమంతటి వ్యక్తిత్వంతో దేశ గతిని మార్చిన బాబా సాహెబ్ అంబేడ్కర్: ఏపీ సీఎం జగన్

పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు స్ఫూర్తినిచ్చేలా 'సామాజిక న్యాయ మహా శిల్పం'

అంబరాన్ని తాకేలా విజయవాడలో 206 అడుగులతో అతి పెద్ద విగ్రహం

19న స్వరాజ్య మైదానంలో విగ్రహావిష్కరణకు అంతా స్వచ్ఛందంగా తరలి రావాలని ఏపీ సీఎం సందేశం

దేశానికే తలమానికం



- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: విజయవాడలో మనందరి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహాశిల్పం రాష్ట్రానికే కాదు.. దేశానికే తలమానికం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. చరిత్రను తిరగరాసేలా మరెందరికో వందల ఏళ్ల పాటు 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ నెల 19వతేదీన విజయవాడలో బాబా సాహెబ్ అంబేడ్కర్ మహా శిల్పం విగ్రహావిష్కరణకు అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతూ సీఎం జగన్ బుధవారం ట్వీట్ చేశారు.

సాక్షి, అమరావతి: అంబరాన్ని తాకేలా విజయవాడలో మనం ఏర్పాటు చేసుకుంటున్న రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోవటమే కాకుండా శతాబ్దాల పాటు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అది 'స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్' (సామాజిక న్యాయ మహా శిల్పం) అని అభివర్ణించారు. మన సమాజ గతిని సమతా భావాల వైపు మరల్చటానికి, సంఘ సంస్కరణలకు, పెత్తందారీ భావాలపై తిరుగుబాటుకు, రాజ్యాధికారంలో పేదల స్థానాన్ని సుస్థిరం చేసేందుకు ఆ మహా శిల్పం నిరంతరం స్ఫూర్తి ఇస్తుందని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. విజయవాడలోని చారిత్రక స్వరాజ్య మైదానంలో ఈ నెల 19వ తేదీన ఆవిష్కరించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతి పెద్దదన్నారు. అంబేడ్కర్ మహా శిల్పాన్ని ఆవిష్కరించనున్న సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ బుధవారం రాష్ట్ర ప్రజలకు ఈమేరకు సందేశం ఇచ్చారు. 'అది 81 అడుగుల వేదికపై ఏర్పాటు చేసిన 125 అడుగుల మహా శిల్పం. అంటే.. 206 అడుగుల ఎత్తైన విగ్రహం. ఆ మహానుభావుడి ఆకాశమంతటి వ్యక్తిత్వం, దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, మహిళా చరిత్రను మార్చేలా దాదాపు 100 ఏళ్ల క్రితమే ఆయన వ్యక్తం చేసిన భావాలు కలకాలం మన దేశాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆయన భావాల పట్ల అచంచల విశ్వాసంతో, బాధ్యతతో వాటిని మన నవరత్నాల్లో అనుసరిస్తున్న ప్రభుత్వంగా ఏర్పాటు చేసిన ఈ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా 19వ తేదీన అందరూ స్వచ్ఛందంగా తరలి రావాలని కోరుతున్నా' అని తన సందేశంలో సీఎం జగన్ పేర్కొన్నారు.

నిరంతరం కాపాడే మహాశక్తి

- ఆయన.. అణగారిన వర్గాలకు చదువులు చేరువ చేసిన మహనీయుడు!
- అంటరానితనం, ఆధిపత్య భావజాలంపై తిరుగుబాటు చేసిన మహానుభావుడు!
- సమ సమాజ భావాలకు నిలువెత్తు రూపం!
- రాజ్యాంగం, రాజ్యాంగ హక్కుల ద్వారా నిరంతరం మనల్ని కాపాడే ఓ మహాశక్తి!
- ప్రతి వాడలో ఉన్న ఆయన విగ్రహం అణగారిన వర్గాలకు నిరంతరం ధైర్యాన్ని, అండని ప్రసాదించే ఓ మహా స్ఫూర్తి!
- దళితులతో పాటు కులాలు, మతాలకు అతీతంగా పేదలందరి జీవితాల్లో ఈ 77 ఏళ్లలో వచ్చిన అనేక మార్పులకు మూలం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ భావాలే!

బెజవాడ నడిబొడ్డున.. 'సోషల్ జస్టిస్ స్ఫూర్తికుడు'



సాక్షి, అమరావతి: బెజవాడ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చేది కొండపై కొలువైన దుర్గమ్మ. అదే బెజవాడకు మరో ప్రత్యేక మణిహారంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కరుడు నిలవనున్నారు. నగరం నడిబొడ్డున గొప్ప చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకున్న స్వరాజ్ మైదానంలో రూపుదిద్దుకున్న బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం, స్మృతివనం దేశంలోనే ప్రత్యేక గుర్తింపును తీసుకురానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత సంకల్పంతో నిర్మించిన 'సామాజిక న్యాయ మహా శిల్పం' దర్శనీయ ప్రాంతంగా మారనుంది. విజయవాడలో నిర్మించింది అంబేడ్కర్ స్మృతివనం మాత్రమే కాదు.. భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శాలు, ఆలోచనలను అందించే గొప్ప ప్రయత్నం కూడా. దానికి సంబంధించిన మరికొన్ని విశేషాలు..

- స్వరాజ్ మైదానంలో 81 అడుగుల పెడస్టల్‌పై 125 అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటుతో మొత్తం 206 అడుగుల ఎత్తు వస్తుంది. ఇది దేశంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహంగా రికార్డు సృష్టించింది.
- కాంస్య విగ్రహాన్ని ఢిల్లీలో తయారు చేయించారు. దాన్ని భాగాలుగా విజయవాడకు తరలించి స్మృతివనంలో క్రమ పద్ధతిలో అతికించి అద్భుతంగా తీర్చిదిద్దారు. విగ్రహం తయారీలో షూ దగ్గర్నుంచి బెల్ట్ వరకు హనుమాన్ జంక్షన్ వద్ద శిల్పి ప్రసాద్ ఆధ్వర్యంలో కాస్టింగ్ చేశారు.
- ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ తుది దశ పనులు చేస్తున్నారు.
- అంబేడ్కర్ విగ్రహం బేస్(పెడస్టల్)లో గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్లున్నాయి.
- గ్రౌండ్ ఫ్లోర్‌లో నాలుగు హాళ్లుండగా.. ఒక్కోటి నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటాయి. అందులో ఒకటి సినిమా హాలు, మిగిలిన మూడు హాళ్లలో ఆయన చరిత్రను తెలిపే డిజిటల్ మ్యూజియం ఉంటుంది.
- మొదటి అంతస్తు(ఫస్ట్ ఫ్లోర్)లో 2,250 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన నాలుగు హాళ్లుంటాయి. ఒక హాల్లో.. అంబేడ్కర్‌కు దక్షిణ భారత దేశంతో ఉన్న అనుబంధాన్ని చిత్రాల ద్వారా డిస్‌ప్లే చేస్తారు.
- రెండో అంతస్తు(సెకండ్ ఫ్లోర్) వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు హాళ్లుంటాయి.
- అంబేడ్కర్ స్మృతివనంలో విగ్రహం ఉన్న ప్రాంతానికి ఒక వైపు నుంచి వెళ్లి.. మరో వైపు నుంచి తిరిగి వచ్చేలా విశాలమైన హాలు మాదిరిగా నిర్మాణాలను పూర్తి చేశారు. వాటి గోడలకు అంబేడ్కర్ జీవిత విశేషాలు, ఆయన చరిత్రకు సంబంధించిన ఘట్టాలను ప్రతిబింబించేలా శిల్పాలను అద్దారు.
- లోపలి భాగంలోని హాళ్లలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అంబేడ్కర్ పాల్గొన్న సమావేశాలు, సభలకు సంబంధించిన పాత చిత్రాలను భారీ చిత్రాలుగా డిజిటలైజ్ చేసి డిస్‌ప్లే చేశారు. ఆయన రాసిన కీలకమైన లేఖలు, ఉపన్యాసాలను ఆయా ఘట్టాలకు అనుగుణంగా ఫొటోలతో పాటు డిస్‌ప్లే చేశారు.
- అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలు, సందేశాలను సైతం క్లుప్తంగా తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో డిజిటల్ బోర్డులపై డిస్‌ప్లే చేశారు. 'చదువు.. సమీకరించు.. బోధించు' వంటి ప్రధానమైన సందేశాలను ప్రముఖంగా ఏర్పాటు చేశారు.
- స్మృతివనం ఆవరణను పచ్చని తివాచీ పరిచినట్టు గరిక, మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు. అంబేడ్కర్ విగ్రహానికి ముందు ఏర్పాటు చేసిన నెమళ్ల ప్రతిరూపాలు ఆకట్టుకుంటున్నాయి.
- మ్యూజిక్‌కు అనుగుణంగా ప్రవహించే వాటర్ ఫౌంటెయిన్‌లను ఏర్పాటు చేశారు. పెడస్టల్ చుట్టూ ఉన్న ప్రాంతంలో వాటర్ కొలను మాదిరిగా ఫౌంటేయిన్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా మరెన్నో ప్రత్యేకతలు అంబేడ్కర్ స్మృతివనంలో దర్శనం ఇవ్వనున్నాయి

ఇంకా సెట్ కాలేదు!

▶ మొదటి పేజీ తరువాయి

ఎంసెట్ సహా ఇతర ప్రవేశ పరీక్షలు కూడా ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోందని విద్యావేత్తలు చెప్తున్నారు.

హడావుడిగా జరిగితే ఇబ్బందులే..

సాధారణంగా ఉమ్మడి ప్రవేశపరీక్షల ప్రక్రియ ఏటా నవంబర్ నుంచే మొదలవుతుంది. వర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి సమావేశం ఏర్పాటు చేసి.. సెట్స్‌కు కన్వీనర్లను ఎంపిక చేయాలి. వారు ప్రశ్నపత్రాల తయారీపై దృష్టి పెడతారు. ప్రశ్నల రూపకల్పనకు సంబంధించి నిపుణులను పిలిపిస్తారు. కంప్యూటర్ బేస్డ్‌గా దాదాపు పది రకాల ప్రశ్నపత్రాలను రూపొందిస్తారు. ఇందులో కఠినమైనవి, తేలికైనవి అత్యంత గోప్యంగా తయారు చేయాలి. తర్వాత వాటన్నింటినీ కలిపి కంప్యూటర్ సాయంతో ఫైనల్ పేపర్‌ను సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తారు. తర్వాత పరీక్ష కేంద్రాల ఎంపిక, ప్రశ్నపత్రాల సగటు పరిశీలన ఉంటాయి. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి, ర్యాంకుల క్రోడీకరణకు ఎక్కువ సమయం పడుతుంది. పలు దఫాలుగా వీసీలు, ప్రొఫెసర్లు సమావేశాలు జరుపుతూ ఉంటే.. ఇవన్నీ సాఫీగా సాగుతాయి. ఈసారి ఇప్పటికీ విద్యా మండలి సమావేశమే జరగలేదు. ఆలస్యంగా ప్రక్రియ మొదలుపెట్టి హడావుడిగా చేస్తే.. ఎక్కడైనా లోపం జరిగితే.. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థుల సన్నద్ధతకూ ఇబ్బంది

ఎంసెట్ ఆలస్యం వల్ల విద్యార్థుల సన్నద్ధతకు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు ఇబ్బంది రావొచ్చని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంసెట్ రాసే విద్యార్థుల్లో చాలా వరకు జేఈఈ మెయిన్స్‌కు కూడా సిద్ధమవుతారు. మెయిన్స్ రెండో దశ ఏప్రిల్‌లో జరుగుతుంది. అది పూర్తయ్యాక మేలో ఎంసెట్ రాస్తుంటారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంసెట్ కోసం ప్రత్యేక కోచింగ్ తీసుకుంటారు. ఎంసెట్ ఆలస్యమైతే ఇబ్బందులు వస్తాయని, కోచింగ్ కేంద్రాల వారు అదనపు ఫీజులు వసూలు చేస్తారని విద్యార్థులు వాపోతున్నారు. ఎన్ఐటీల్లో సీట్ల కౌన్సెలింగ్ నాటికి ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలవకపోతే.. కోరుకున్న కాలేజీలో సీట్లు వస్తాయా? రావా? అన్న ఆందోళన కూడా ఉంటుందని పేర్కొంటున్నారు.

ఉన్నత విద్యా మండలిలో గందరగోళం!

రాష్ట్రంలో ఉమ్మడి ప్రవేశపరీక్షలకు సంబంధించి డిసెంబర్‌లోనే యూనివర్సిటీల వీసీలతో ఉన్నత విద్యా మండలి అధికారులు సమావేశం కావాలని నిర్ణయించారు. తేదీ కూడా ఖరారు చేశారు. సెట్ కన్వీనర్ల ఎంపికకూ రంగం సిద్ధమైంది. ఈలోగా కొత్త ప్రభుత్వం మండలి చైర్మన్‌తోపాటు, వైస్ చైర్మన్‌ను తొలగిస్తున్నట్టు ప్రకటించడంతో.. వీసీలతో సమావేశం వాయిదా పడింది. అయితే ప్రభుత్వం కొత్తవారిని నియమించలేదు. తొలగిస్తున్నట్టు ప్రకటించిన చైర్మన్, వైస్ చైర్మన్ ఇంకా అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. ఉన్నత విద్యకు సంబంధించి సీఎం సమీక్షల్లో సరైన సమాచారం ఇవ్వడానికి మండలిలో ఎవరూ లేకపోవడంతో.. వారిని కొనసాగిస్తున్నట్టు ఉన్నతాధికారులు చెప్తున్నారు. వీరినే తిరిగి నియమించే అవకాశం ఉందనీ అంటున్నారు.

సమావేశాలకు వీసీల విముఖత

ఉన్నత విద్యా మండలి చైర్మన్, వైస్ చైర్మన్లను తొలగించిన నేపథ్యంలో.. అధికారికంగా సమావేశాలు నిర్వహించేందుకు వీలుకావడం లేదని మండలి వర్గాలు చెప్తున్నాయి. దీనికి తోడు ఉమ్మడి ప్రవేశపరీక్షలపై చర్చించేందుకు వెళ్లడానికి వర్సిటీల వీసీలూ సుముఖత వ్యక్తం చేయడం లేదని అంటున్నాయి. సెట్స్ కోసం కన్వీనర్లను సూచించాలని మండలి నుంచి లేఖలు వచ్చినా.. యూనివర్సిటీల వీసీలు నిర్లిప్తంగా ఉంటున్నారు. ''ముందు చైర్మన్, వైస్ చైర్మన్లను కొనసాగిస్తారా? కొత్తవారిని తెస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు మేం సెట్స్ కన్వీనర్ల పేర్లు ఇచ్చినా.. కొత్త చైర్మన్ వస్తే మార్పులు ఉంటాయి..'' అని ఓ వర్సిటీ వీసీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆదరణ పెరుగుతున్నా..!

కొన్నేళ్లుగా ఎంసెట్ రాసే వారి సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రస్థాయిలో సీట్లు ఎక్కువగా ఉండటం, ఉపాధి కోసం, విదేశాల్లో ఉన్నత విద్య కోసం వెళ్లడానికి అవకాశం ఉండటంతో చాలా మంది ఇంజనీరింగ్‌లో చేరుతున్నారు. 2018లో 2.20 లక్షల మంది ఎంసెట్ రాస్తే.. 2023 నాటికి ఈ సంఖ్య 3 లక్షలు దాటింది. పరీక్ష రాసేవారి సంఖ్య ఏటా 20శాతం దాకా పెరుగుతోంది. నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి కూడా ఎంసెట్ (మెడికల్ అండ్ అగ్రికల్చర్) తప్పనిసరి చేయడంతోనూ అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.

ఎంసెట్‌కు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య ఇదీ..

ఏడాది	ఇంజనీరింగ్	అగ్రికల్చర్
2018	1,47,912	73,078
2019	1,42,218	74,981
2020	1,43,326	78,981
2021	1,64,963	86,641
2022	1,61,552	88,156
2023	1,95,275	1,06,514

జిల్లా వార్తలు


రామయ్య నిత్యాన్న దానానికి విరాళాలు



ఖమ్మానికి చెందిన దాతలకు రశీదు అందజేస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి బుధవారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. ఏపీలోని కాకినాడ సమీపంలోని ఇంద్రపాలెం గ్రామానికి చెందిన అనంత రామారావు, మాణిక్యాంబ దంపతులు రూ.1,00,001, ఖమ్మం సహకార నగర్‌కు చెందిన దేశగాని సత్యనారాయణ, నరసింహస్వామి, ఆదినారాయణ రూ.1,00,116 వితరణగా అందజేయగా, ఆలయ అధికారులు దాతలకు రశీదులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ, పర్యవేక్షకులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయానికి రూ.50 వేలు..



జమలాపురం ఆలయంలో విరాళం అందజేస్తున్న నర్సింహస్వామి

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బుధవారం ఖమ్మానికి చెందిన రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ అధికారి నాగినేని నర్సింహస్వామి తన సతీమణి సత్యావతి జ్ఞాపకార్థం రూ.50 వేల చెక్కు ఆలయ సూపరింటెండెంట్ కె.విజయకుమారికి అందజేశారు. అనంతరం శ్రీస్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు నాగినేని రామకృష్ణ, పవన్‌కుమార్, హేమాద్రి రంగారావు, కల్యాణ్ చక్రవర్తి, అనురాధ, అరుధంతి, రజిని, లత, ఆలయ ఉప ప్రధాన అర్చకులు ఉప్పల విజయ దేవశర్మ, సిబ్బంది వంశీ పాల్గొన్నారు.

సమ్మెతో స్తంభించిన రవాణా



ఖమ్మంలో నిలిచిపోయిన లారీలు

- హిట్ అండ్ రన్‌ను వ్యతిరేకిస్తూ డ్రైవర్లు, క్లీనర్ల సమ్మె
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన లారీలు
- పంట ఉత్పత్తులు, నిత్యావసరాల సరఫరాకు బ్రేక్



ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం : లారీ డ్రైవర్లు చేపట్టిన సమ్మెతో రవాణా వ్యవస్థ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం 106(2) హిట్ అండ్ రన్ చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం వాహన ప్రమాదం జరిగిన సమయంలో వ్యక్తి మరణిస్తే వాహన డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ చట్ట పరిధిలోకి అన్ని రకాల వాహనదారులు, డ్రైవర్లు వస్తారు. అయితే ఈ చట్టం సమంజసమైంది కాదంటూ ఆలిండియా లారీ డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లా లారీ డ్రైవర్ల, క్లీనర్లు సమ్మెలో పాల్గొంటున్నారు. కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ హుస్సేన్, బి.రామకృష్ణ తదితరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

నిలిచిపోయిన వాహనాలు..

డ్రైవర్లు, క్లీనర్ల సమ్మెతో జిల్లాలో పెద్దసంఖ్యలో లారీలు నిలిచిపోయాయి. యజమానులే డ్రైవర్లుగా ఉన్న లారీలు మాత్రం అక్కడక్కడా తిరుగుతున్నాయి. అయితే డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీలు తిరగకుండా ప్రతిఘటిస్తున్నారు.

పంట ఉత్పత్తుల రవాణాకు బ్రేక్

డ్రైవర్లు, క్లీనర్ల సమ్మెతో రవాణా వ్యవస్థ స్తంభించింది. ప్రస్తుతం పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాల సీజన్ కావడంతో కొనుగోలు చేసిన వ్యాపారులు వాటిని సుదూర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ రవాణాకు ప్రధానంగా లారీలను వినియోగిస్తుంటారు. రాష్ట్రంలో పెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఖమ్మం మార్కెట్ రెండోది. ఈ మార్కెట్‌కు నిత్యం పెద్ద ఎత్తున మిర్చి, పత్తి పంటలు విక్రయానికి వస్తుంటాయి. కొనుగోలు చేసిన వ్యాపారులు గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలకు రవాణా చేస్తారు. అంతేగాక ఇక్కడ కొనుగోలు చేసే తేజా రకం మిర్చిని విదేశాలకు కూడా తరలిస్తుంటారు. సముద్ర మార్గాన తరలించే ఈ పంటను షిప్ యార్డు వరకు లారీలు, కంటైనర్లలో పంపిస్తారు. బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోలు చేసిన పంటలను ఆయా ప్రాంతాలకు రవాణా చేసేందుకు లారీలు అందుబాటులో లేకపోవటంతో ఎక్కడికక్కడ నిల్వ పెట్టుకున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంట కొనుగోళ్లకు ఇబ్బందులు తలెత్తుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

నిత్యావసరాలదీ అదే పరిస్థితి..

డ్రైవర్ల సమ్మె కారణంగా లారీల నిలిచిపోవడంతో నిత్యావసరాల రవాణాకు కూడా బ్రేక్ పడే పరిస్థితి నెలకొంది. పొరుగు రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి వివిధ రకాల నిత్యావసరాలు దిగుమతి అవుతుంటాయి. మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డ, ఆలుగడ్డ, ఆంధ్ర, కర్ణాటక నుంచి టమాట వంటి కూరగాయలు ఇక్కడికి వస్తుంటాయి. సమ్మె తీవ్ర రూపం దాల్చితే నిత్యావసరాలకు కూడా ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది.

పత్తి రవాణా నిలిచిపోయింది



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు విక్రయానికి తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేశా. గుజరాత్‌కు ఆర్డర్ ఉంది. సరుకు పంపించడానికి లారీ డ్రైవర్ల సమ్మె ఆటంకంగా మారింది. దీంతో కొనుగోలు చేసిన పత్తిని నిల్వ పెట్టాల్సి వచ్చింది. ఆ సరుకును వెంటనే రవాణా చేస్తే లావాదేవీలకు ఇబ్బంది ఉండదు. నిల్వ పెడితే సమస్యలు తప్పవు.

– మన్నెం కృష్ణ, ఖరీదుదారు

హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాం



కేంద్రప్రభుత్వం రూపొందించిన 106(2) హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాం. దీన్ని రద్దు చేసి పూర్వపు చట్టాన్ని కొనసాగించాలి. నూతన చట్టాలతో శిక్షలు, జరిమానాలు పెంచడం సరికాదు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ అసోసియేషన్ పిలుపు మేరకు నిరవధిక సమ్మె చేపట్టాం. అన్ని రకాల వాహనదారులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలి.

–బి.రామకృష్ణ, అసోసియేషన్ కార్యదర్శి

'ఏకలవ్య' విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

ఐటీడీఏ డీడీ మణెమ్మ

భద్రాచలంటౌన్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ పాఠశాలల విద్యార్థులకు చదువుతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ డీడీ మణెమ్మ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం విద్యార్థులకు పంపిణీ చేసే యూనిఫామ్, ఇతర సామగ్రి సరఫరా చేసేందుకు టెండర్ల కమిటీ సమక్షంలో ఏజెన్సీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టెండర్లలో తక్కువ ధరకు కోట్ చేసిన ఏజెన్సీలకు సామగ్రి సరఫరా బాధ్యతలను అప్పగించామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అతి త్వరలోనే సామగ్రి సరఫరా చేస్తామని, ఏ పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారనే వివరాలను వెంటనే కమిటీ సభ్యులకు, గురుకులం ఆర్సీఓ కార్యాలయానికి పంపించాలని సంబంధిత పాఠశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు. టెండర్ దారులు సాధ్యమైనంత త్వరగా శాంపిళ్ల ప్రకారం కమిటీ సభ్యులకు చూపించిన సామగ్రిని మాత్రమే సరఫరా చేయాలని చెప్పారు. ఏవైనా వస్తువులు నాసిరకంగా ఉన్నాయని ప్రిన్సిపాళ్లు ఫిర్యాదు చేస్తే ఏజెన్సీలపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని, ఇకపై ఎక్కడా టెండర్ దాఖలు చేయకుండా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఐటీడీఏ రూపాదేవి, ఈఎంఆర్ఎస్ చర్ల ప్రిన్సిపాల్ శకుంతల, కృష్ణార్జునరావు, చంటి, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఏజెన్సీల యజమానులతో మాట్లాడుతున్న డీడీ

దిమ్మ'తిరుగు' ప్రయాణం



ప్రయాణీకులతో రద్దీగా సత్తుపల్లి బస్టాండ్

- బస్సుల్లో సీట్లు కటకట
- కిక్కిరిసి ప్రయాణిస్తున్న వైనం

సత్తుపల్లిటౌన్: సంక్రాంతి పండక్కి వచ్చిన ఆనందం తిరుగు ప్రయాణం రద్దీతో ఆవిరవుతోంది. ఆర్టీసీ షెడ్యూల్ బస్సులతో పాటు ప్రత్యేక బస్సులు నడుపుతున్నా.. అంతా ఒక్కసారిగా తిరుగు పయనమవడంతో జిల్లాలోని బస్టాండ్లు కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్‌కు రిజర్వేషన్లు ముందే అయిపోవడంతో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సీట్లు దొరకక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, అశ్వారావుపేట రూట్లలో తిరిగే బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్లాట్‌ఫాంలోకి ఏ బస్సు వచ్చినా.. పరుగెత్తుకుంటూ వచ్చి బస్సులు ఎక్కుతున్నారు. చిన్నారులు, చంటి పిల్లల తల్లులు, మహిళలకు ఇబ్బందులు తప్పటం లేదు.

ట్రాఫిక్‌ను చక్కబెడుతూ..

సంక్రాంతి వేడుకలను ఏటా మూడురోజుల పాటు సొంతూళ్లలో చేసుకోవడం ఆనవాయితీ. ఈ మూడు రోజులు సంతోషంగా గడిపి తిరుగు ప్రయాణమైన వారికి సరిపడా బస్సులు లేక ప్రయాణం భారంగా సాగుతోంది. ఆర్టీసీ డిపోల్లో అత్యవసర సమయాల్లో ఉంచే స్పేర్ బస్సులను కూడా తిప్పుతుండటంతో డిపోలు ఖాళీ అయ్యాయి. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు బస్టాండ్‌లలోని ప్రయాణికులను ఎప్పటికప్పుడు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. 24 గంటలూ అందుబాటులో ఉంటూ పరిస్థితులకు చక్కబెడుతున్నారు. గతంలో కంటే ఈ సంక్రాంతికి తెలంగాణ ప్రభుత్వం మహిళలకు కల్పించిన మహాలక్ష్మి పథకంతో ఉచిత ప్రయాణ సదుపాయం వల్ల రద్దీ విపరీతంగా పెరిగింది.



బస్సుల్లో సీట్లు అయిపోయాయంటూ నోటీసు

ముందే ఆన్‌లైన్ బుకింగ్‌తో..

పండక్కి వచ్చేటప్పుడే తిరుగు ప్రయాణానికి కూడా చాలా మంది ఆన్‌లైన్‌లో బుకింగ్ చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు ఆర్టీసీ రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులకు ఆన్‌లైన్ రిజర్వేషన్లు పూర్తయ్యాయి. దీంతో హైదరాబాద్‌కు వెళ్లే రిజర్వేషన్ లేని ప్రయాణికులు ఖమ్మం వరకు వచ్చి హైదరాబాద్ బాట పడుతున్నారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు..



ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నాం. రిజర్వేషన్ బస్సులతో పాటు అదనపు సర్వీస్‌లను నడుపుతున్నాం. సాధారణ చార్జీలతోనే స్పెషల్ బస్సులను తిప్పుతున్నాం. పండగకు వచ్చిన వారి తిరుగు ప్రయాణం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ డీఎం, సత్తుపల్లి

చార్జీల బాదుడు..

హైదరాబాద్‌కు ఖమ్మం రీజియన్ నుంచి రెగ్యులర్ సర్వీస్‌లతో పాటు రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ అదనంగా నడుపుతోంది. ఆ బస్సుల్లో చార్జీలు సామాన్యులకు చుక్కలు చూపిస్తుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. అయినా, తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్తున్నారు. సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు ఒక్కో టిక్కెట్‌కు రూ.700 వరకు వెచ్చించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. అదనపు సర్వీసులకు అదనపు చార్జీలు వసూలు చేయనప్పటికీ రద్దీ మాత్రం పెరిగింది. ఖమ్మం రీజియన్‌లో ఈ నెల 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి జిల్లాకు సుమారు 300 బస్సులతో ప్రయాణికులను సొంతూళ్లకు చేర్చారు. సత్తుపల్లి నుంచి ఖమ్మానికి రోజువారీగా తిరిగే 17 బస్సులతో పాటు అదనంగా ఆరేడు బస్సులను ప్రస్తుతం తిప్పుతున్నారు. ఏ బస్సులో చూసినా 70 నుంచి 80 వరకు ప్రయాణికులు నిల్చొని మరీ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు.